క్లుప్తంగా

అధినేతను కలిసిన విజయానందరెడ్డి



చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి కలిశారు. బుధవారం తాడేపల్లె పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో రాజకీయ వేధింపులు, దౌర్జన్యాలు, ప్రజల్లో పెరుగుతున్న వ్యతిరేకత, ప్రజా సమస్యలపై చేయవలసిన పోరాటం..ఇత్యాది అంశాలపై చర్చించినట్టు ఆయన చెప్పారు.

ఫ్యామిలీ డాక్టర్



గర్భవతిని పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భవతులు రక్తహీనత బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక కోరారు. బుధవారం దిగువమాఘంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొనన్నారు.

టీబీ ముక్తభారత్‌కు 18 పంచాయతీల ఎంపిక

చిత్తూరు రూరల్(కాణిపాకం): టీబీ ముక్తభారత్ పథకానికి జిల్లాలోని 18 పంచాయతీలు ఎంపికయ్యాయి. ఆ పంచాయతీల్లో జిల్లా క్షయ నివారణ అధికారులు పర్యటించి, వివరాలు సేకరిస్తున్నారు. వివరాలను శనివారంలోపు ప్రభుత్వానికి అందజేయనున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తెలిపారు.

అక్రమ అరెస్టుపై నిరసన

చిత్తూరు అర్బన్: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జాతీయ అధ్యక్షుడు ఎంకే ఫైజీని ఏకపక్షంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ చిత్తూరు దర్గా సర్కిల్‌లో బుధవారం ఎస్‌డీపీఐ(సోషల్ డెమొక్రటిక్ ఆఫ్ ఇండియా) నిరసన వ్యక్తం చేసింది. నాయకులు మాట్లాడుతూ, ఈ అన్యాయమైన అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చాన్‌బాషా, ఆసిఫ్, కరీం, తౌఫిక్ ప్రధా తదితరులు పాల్గొన్నారు.

నేడు శిక్షణ

తవణంపల్లె: అరగొండ మేజర్ పంచాయతీలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం వద్ద ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహిస్తామని ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. తవణంపల్లె, ఐరాల, బంగారుపాళ్యం, యాదమరి, పూతలపట్టు, చిత్తూరు, గుడిపాల, గంగాధరనెల్లూరు మండలాల్లోని ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు.

నో.. స్టాంప్ పేపర్స్..!

- స్టాకు ఉన్నా అందుబాటులోకి
- దోచుకుంటున్న స్టాంప్ వెండర్లు



చిత్తూరు అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంప్స్ స్టాక్ లేదని ఉంచిన నోటీసు బోర్డు

చిత్తూరు కార్పొరేషన్: ఈ-స్టాంపింగ్, స్టాంప్ వెండర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు నాన్ జ్యుడీషియల్ పేపర్లను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో విక్రయిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఆది నుంచి అంతంమాత్రంగానే సరఫరా చేస్తుండడంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ఆస్తుల క్రయ-విక్రయాలకు, రెంట్ అగ్రిమెంట్, ఇతర లావాదేవీలకు నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లను వినియోగిస్తారు. కానీ ఇవి ఎప్పుడూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాక్ ఉండటం లేదు. ప్రస్తుతం జిల్లాకు రూ.100 విలువైన స్టాంప్ పేపర్లు రూ.20 లక్షల విలువకు స్టాక్ వచ్చింది. కానీ వాటిని క్షేత్రస్థాయిలో సరఫరా చేయలేదు. ఇదే అవకాశంగా స్టాంప్ వెండర్లు, ఈ-స్టాంపుల విక్రేతలు రేట్లు పెంచి దోచుకుంటున్నారు. స్టాంప్ పేపర్ల విక్రయాలను ఆన్‌లైన్ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో ప్రజలు వెండర్లను ఆశ్రయించి వారికి అడిగినంత ఇచ్చుకోవాల్సి వస్తోంది. జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే తీరు కనిపిస్తోంది. వినియోగదారులకు అవసరమైన స్టాంప్ పేపర్లు ఉన్నా వాటిని విక్రయించడానికి అధికారులు చొరవ చూపడం లేదనే విమర్శలొస్తున్నాయి. సాంకేతిక కారణాల వల్ల స్టాంప్ పేపర్ల విక్రయాలు నిలుపుదల చేశామని, త్వరలో మళ్లీ విక్రయించనున్నట్టు జిల్లా రిజిస్ట్రార్ ఏవీఆర్ మూర్తి తెలిపారు.

వారిద్దరి మధ్య బిల్లుల కోల్డ్ వార్..!

చిత్తూరు రూరల్(కాణిపాకం): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పలు రకాల బిల్లుల సంతకాలకు ఇద్దరు అధికారుల మధ్య తగ్గపడింది. ఇటీవల కార్యాలయ నిర్వహణ, అధికారుల కార్యకలాపాలకు సంబంధించి రూ. 4లక్షల వరకు బిల్లులు పెట్టారని సమాచారం. ఈ బిల్లులు కొన్ని ఫేక్ కావడంతో ఓ అధికారి తాను సంతకం పెట్టనని ఆ జిల్లా అధికారికి నిర్మొహమాటంగా ముఖం మీదే చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆయన ఈగో హర్ట్ అయిందట! ఆ అధికారి బిల్లుల్లో కూడా సంతకం చేసేది లేదంటూ ఈయన రివర్స్ ఎటాక్ ఇచ్చినట్టు సమాచారం. దీంతో ఆ ఇద్దరి మధ్య వార్‌కు తెరలేచి, ఆ అధికారి నుంచి అదనపు బాధ్యతలు పీకేశారని అధికార వర్గాలు కోడై కూస్తున్నాయి. అతన్ని మాత్రమే తప్పిస్తే..కక్షతో చేశారనుకుంటారని మరో ఇద్దరిని కూడా అదనపు బాధ్యతలను తప్పించారనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆ అధికారి సంతకం పెట్టని బిల్లులపై అందరి చూపు పడింది. అందులో ఫేక్ బిల్లులు ఉన్నాయని.. ఆ బిల్లుల్లో సంతకాలు పడితే....జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు కార్యాలయంలోని కొందరు అధికారులు రెడీగా ఉన్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

వేలంలో అర్ధగిరికి రూ.6.90లక్షల ఆదాయం



అర్ధగిరి క్షేత్రంలో వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో నిర్వహించిన వేలంలో రూ.6.90 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. బుధవారం అర్ధగిరి క్షేత్రంలోని మండపంలో తలనీలాలు, కొబ్బరి చిప్పల సేకరణకు వేలం నిర్వహించారు. యాదాద్రి భువనగిరికి చెందిన బి. ఏడుకొండలు రూ.5.70లక్షలకు వేలం పాడి తలనీలాల హక్కు, కొబ్బరి చిప్పల సేకరణను పత్రపల్లెకు చెందిన టి. రమేష్ రూ. 1.20 లక్షలకు అధికంగా పాట పడి కైవసం చేసుకున్నారు. వీరికి ఏప్రిల్ నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకు హక్కు కల్పిస్తున్నట్లు ఈఓ చెప్పారు. షాపులు, పాదరక్షలు వేలం వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ, సిబ్బంది, వేలం పాటదారులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత పాత్రే కీలకం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీవీకేఎన్ ప్రిన్సిపాల్ జీవనజ్యోతి

చిత్తూరు కలెక్టరేట్ : దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని పీవీకేఎన్ ప్రిన్సిపల్ డాక్టర్ జీవనజ్యోతి అన్నారు. జిల్లా నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాలలో జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమం పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువత తమ మేధాశక్తితో ప్రపంచంలో మన దేశాన్ని ప్రథమ స్థానంలో ఉండేలా చేయాలన్నారు. ఈ మేరకు యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో యువత భాగస్వాములై సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 18 నుంచి 25 ఏళ్ల కలిగిన యువత ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. తొలుత ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మై భారత్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. ఒక నిమిషం కలిగిన వికసిత్ భారత్ అంటే మీరేమనుకుంటున్నారు...? అనే అంశంపై వీడియో చేసి మార్చి 9వ తేదీ లోపు పోర్టల్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లా స్థాయిలో ఈ నెల 15 వ తేదీన పీవీకేఎన్ కళాశాలలో ఎంపిక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 7396496269, 83688 66411 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అధునాతన పద్ధతులతో అధిక దిగుబడులు

ఐరాల: రైతులు అధునాతన పద్ధతులపై అవగాహన పెంచుకుని తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి వరలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని పాలకల ఆర్‌ఎస్‌కేలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు అధునాతన పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి పెట్టుబడుల వ్యయం తగ్గించుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు వాడుకోవాలన్నారు. పంటల సాగులో అధిక దిగుబడులు సాధించడానికి భూమి సారవంతంగా, ఆరోగ్యవంతంగా ఉంచుకోవాలన్నారు. డ్రోన్లతో పురుగు మందులు పిచికారీ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వచ్చే వారం నుంచి రైతులకు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై పంపిణీ చేస్తామన్నారు. అవసరమైన రైతులు ఆర్‌ఎస్‌కే సిబ్బందిని సంప్రదించాలని కోరారు. తొలుత స్థానిక రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ గ్రీవెన్స్‌కు 3 సమస్యలు



వినియోగదారులతో మాట్లాడుతున్న ఈఈ

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక గాంధీరోడ్డులోని ట్రాన్స్‌కో ఈఈ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విద్యుత్ గ్రీవెన్స్‌లో డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వినియోగదారులు సమస్యలు నివేదించారు. ప్రధానంగా తమకు 3 ఫిర్యాదులు అందాయని ఈఈ మునిచంద్ర తెలిపారు. కొంగారెడ్డిపల్లె సెక్షన్ పరిధిలో మీటర్ పేరు మార్పు చేయాలని, సంతపేట పరిధిలో రివిజన్ ఆఫ్ బిల్లు, కరెంటు స్తంభం మార్పు చేయాలని వినతులు అందినట్టు చెప్పారు. కార్యక్రమంలో డీఈలు ప్రసాద్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం స్మగ్లింగ్ కేసులో ఐదుగురి అరెస్ట్

చిత్తూరు అర్బన్: రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులో ఐదుగురు నిందితులను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. నగరంలోని కైలాసపురం వద్ద ఓ గోదాములో ఐదు టన్నుల వరకు రేషన్ బియ్యాన్ని దాచి ఉంచి, వేరే ప్రాంతాలకు స్మగ్లింగ్ చేస్తుండటంపై మంగళవారం పోలీసులు దాడులు చేయడం విదితమే. ఈ ఘటనలో పెద్ద పంజాణి మండలం రాయల్‌పేటకు చెందిన వెంకటరమణ (28), అమర్‌నాథ్ (25), బైరెడ్డిపల్లెకు చెందిన జగన్నాధం (30), చిత్తూరు ప్రశాంత్ నగర్‌కు చెందిన ముత్తు (24), జానకారపల్లెకు చెందిన మహేష్ (37)ను పోలీసులు అరెస్టు చేశారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్తూరులో చిత్రలేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ విజయశేఖర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు పోలీసుశాఖ నిర్వహిస్తున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా విద్యార్థినులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. 'లింగ సమానత్వం' అనే అంశంపై జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థినులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. డిజిటల్ యుగంలో మహిళల భద్రత అనేది అత్యంత ప్రాధాన్యత ఉన్న అంశంగా మారడంతో పిల్లల్లో చిత్రలేఖనం ద్వారా అభిప్రాయాలను సేకరించినట్లు ఎస్పీ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 8వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

గాలికుంటు నివారణకు టీకా తప్పనిసరి



పాడి ఆవుకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి పినకాపాణి



గుడిపాల: పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్

ఐరాల: పాడి పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరి అని మద్దిపట్లపల్లె పశు వైద్యాధికారి పినాకపాణి అన్నారు. బుధవారం మండలంలోని గుడిపల్లెలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి ఆయన మాట్లాడారు. గాలికుంటు నివారణ వారోత్సవాలను బుధవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశువులకు వ్యాపించే ప్రాణాంతకమైన వ్యాధుల్లో గాలికుంటు వ్యాధి ఒకటని, ఈ వ్యాధి సోకితే తీవ్రమైన జ్వరం ఉంటుందని, ఎద్దుల్లో పని సామర్థ్యం, పాడి పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా పడిపోయి పాడి రైతులు నష్టపోతారన్నారు. ఈ పరిస్థితి తలెత్తకుండా టీకాలు సద్వినియోగం చేసుకుని పశువులను కాపాడుకోవాలని కోరారు. గ్రామంలో 180 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు, 4 నుంచి 8 నెలల లోపు ఉన్న 24 పేయదూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేసినట్లు తెలిపారు. పశు బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాలకల పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో..

గుడిపాల: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పాడి రైతులు వేయించుకోవాలని పశువైద్యాధికారి సాయిసుధ కోరారు. ఏఎల్‌పురంలో బుధవారం ఆమె పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసి మాట్లాడారు. ఈ టీకాలు వేయకపోతే పశువులు వివిధ వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని, ఉచితంగా వస్తున్న ఈ టీకాలను పశువులకు వేయించాలని కోరారు. గుడిపాలలో 17వేల వరకు పాడి ఆవులు, ఎద్దులు ఉన్నాయని, ఈ నెలాఖరు వరకు గ్రామాల్లో టీకాలు వేస్తామన్నారు.

మార్కెట్ వేలం.. పంచాయతీకి ఆదాయం



వేలం నిర్వహిస్తున్న సర్పంచ్, ఈఓపీఆర్డీ

ఐరాల: మండలంలోని కాణిపాకం పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మార్కెట్ బహిరంగ వేలంలో పంచాయతీకి రూ.1,425,000 ఆదాయం వచ్చినట్లు ఈఓపీఆర్డీ కుసుమకుమారి తెలిపారు. వారపు సంతను అగరంపల్లెకు చెందిన రాధ రూ.7,64,000, అలాగే దినసరి సంతను రూ.6,11,000 హెచ్చు పాట పాడి కైవసం చేసుకున్నారు. అగరంపల్లె చెరువును జయచంద్రారెడ్డి, కాణిపాకం చెరువును జీఎస్.మురళి వేలంలో ఎక్కువ పాడి హక్కులు కైవసం చేసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, వార్డు సభ్యులు, వేలం పాటదారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహా ధర్నాపై ఆశలతో..!



విజయవాడకు బయలుదేరుతున్న కార్మికులు

- విజయవాడకు బయల్దేరిన కార్మికులు

చిత్తూరు కార్పొరేషన్: ఛలో విజయవాడ కార్యక్రమానికి జిల్లాకేంద్రం నుంచి ఆశా కార్మికులు బయలుదేరారు. బుధవారం చిత్తూరు రైల్వే స్టేషన్ నుంచి రైలులో వెళ్లారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఆశా కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో విజయవాడలో మహా ధర్నా చేయనున్నట్లు నాయకులు గంగరాజు, గంగ తెలిపారు. కార్మికుల పోరాటానికి పిలుపునిచ్చినప్పుడు వారిని దారి మళ్లించడానికి కొన్ని సమస్యలు పరిష్కరించామని చెప్పడం పాలకులకు షరా మామూలు అయిందన్నారు. ఆశా కార్మికులకు గ్రాట్యుటీ ఇస్తున్నామని, వయోపరిమితి పెంచామని ప్రభుత్వం ప్రకటన చేసింది కానీ కనీస వేతనాలు గురించి ఏమాత్రం ప్రస్తావించలేదన్నారు. కార్మికుల సంఘటిత పోరాటాలతో సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. జిల్లాలోని కొన్ని పీహెచ్‌సీలో అధికారులు ఆశా కార్మికులను వేధింపులకు గురి చేయడం సరికాదని, సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు గానీ ప్రభుత్వం గానీ స్పందిస్తే పోరాటాలు ఎందుకు చేస్తామని ప్రశ్నించారు.

ఉపాధి కూలీలపై చిన్నచూపు సహించం

- 300 రోజులు పనిదినాలు కల్పించాలి
- కలెక్టరేట్ ఎదుట బీకేఎంయూ సంఘం ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీకేఎంయూ సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్: కూటమి ప్రభుత్వం ఉపాధి కూలీలపై చిన్నచూపు చూస్తే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా కార్యదర్శి రామమూర్తి హెచ్చరించారు. ఆ సంఘ నాయకులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కూలీలకు సంవత్సరంలో 300 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా రోజువారి కూలీ రూ.700 తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్యాయం జరుగుతోందన్నారు. చాలా జిల్లాల్లో పనులు చూపించలేక వేలాది కుటుంబాలు బతుకుదెరువు కోసం ఇతర రాష్ట్రాలకు వలసలు వెళుతున్నాయని ఆరోపించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీల వలసలు ఆపాలంటే సంవత్సరంలో 300 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉపాధి హామీ పనులు చేసే కూలీలకు మజ్జిగ, షెల్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదవశాత్తు ఉపాధి కూలీలు మృతి చెందితే ఆ కుటుంబానికి రూ.20 లక్షలు ప్రభుత్వం తరఫున అందజేయాలన్నారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఉపాధి కూలీలను కలుపుకుని దశలవారీగా ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సీపీఐ పార్టీ నాయకులు కే.మణి, పి. రఘు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయు) నాయకులు వెంకటేష్ (పలమనేరు) నాగమ్మ పాల్గొన్నారు.

తెప్పోత్సవం.. నయనానందం

- వార్షిక బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం





విశేషాలంకారంలో మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ, తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు

బంగారుపాళెం: మొగిలి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి తెప్పోత్సవంతో పరి సమాప్తమయ్యాయి. శ్రీకామాక్షి సమేత స్వయంభు మొగిలీశ్వరస్వామికి ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. రాత్రి అలంకార మండపంలో స్వామి, అమ్మవారిని విశేషంగా అలంకరించి ఆలయ పుష్కరిణిలో ఏర్పాటు చేసిన తెప్పపై కొలువు దీర్చారు. ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరులు తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ ఉత్సవానికి బంగారుపాళ్యానికి చెందిన బేబి, మాధవనాయుడు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ఈఓ మునిరాజు మాట్లాడుతూ, 11 రోజుల పాటు వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించామని, దీని వెనుక పోలీసు సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, గ్రామస్తులు, ఉభయదారుల సహకారం ఉందని చెప్పారు. పరిసర ప్రాంతాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మ వారిని దర్శించుకున్నారన్నారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

- సీఎంను కోరిన ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ



సీఎంకు ఆపస్ డైరీ అందజేస్తున్న బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ సీఎంను కోరినట్లు తెలిపారు. బుధవారం విజయవాడలో ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మర్యాద పూర్వకంగా కలిసి ఆపస్ నూతన సంవత్సర డైరీ అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆపస్, ఇతర మిత్ర సంఘాలు బలపరిచి, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా గెలుపొందిన గాదె శ్రీనివాసులుతో కలిసి సీఎంను కలిశామన్నారు. 2003 డీఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలన్నారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలు చేసి, అన్ని కేడర్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో సుదూరంగా ఉన్న పాఠశాలల నుంచి 3,4,5 తరగతులను విలీనం చేయడం వంటి సమస్యలు పరిష్కరించాలన్నారు. జెడ్పీ టీచర్లకు రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. డీఈఓ పూల్‌లో ఉన్న 1,100 మంది భాషా పండితులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం పలు సమస్యలను ఆపస్ సంఘం తరఫున సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

కృత్రిమ అవయవాల త్రీడీ ప్రింటింగ్‌పై సదస్సు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు మురకంబట్టులోని అపోలో కాలేజీలో బుధవారం ఐఐటీ తిరుపతి, అపోలో వైద్య కళాశాల సంయుక్తంగా కృత్రిమ అవయవాలను త్రీడీ ప్రింటింగ్ విధాన ప్రక్రియపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అపోలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వినోద్ భట్ త్రీడీ ప్రింటింగ్‌తో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఐఐటీ తిరుపతికి చెందిన మామిళ్ల రవి శంకర్ బయోమెడికల్ అప్లికేషన్‌లో ఇంప్లాంట్ల ఫినిషింగ్ విధాన ప్రక్రియను వివరించారు. అనంతరం త్రీడీ ప్రింటింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రదర్శించారు. వైద్యశాస్త్ర విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు సదస్సుకు భారీ సంఖ్యలో హాజరై, సాంకేతిక పరిజ్ఞాన అవకాశాలను అన్వేషించారు. ప్రొఫెసర్లు సుభద్రాదేవి, రవిశంకర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోనే మద్యం విక్రయం!

బంగారుపాళెం: మండలంలోని మొగిలివారిపల్లెలో బుధవారం సాయంత్రం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. గ్రామానికి చెంది న విశ్వనాథ్ తన ఇంటి వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో తనిఖీలు చేసినట్లు చెప్పారు. అతని ఇంట 50 మద్యం క్వార్టర్ బాటిళ్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు.